## గురుపూర్ణిమాసందేశము

సర్వేవై సుఖినో భవంతు సర్వేసంతు నిరామయాః
సర్వేభద్రాణి పశ్యంతు మాకశ్చిత్ దుఖఃమాప్నుయాత్.

ప్రేమస్వరూపులారా!

ఈ జగత్తునందు సమస్త వస్తువులు భగవంతుని సంకల్పముచేతనే ఆవిర్భవిస్తున్నారు. ఈ ఆవిర్భవించిన జగత్తును తానే పోషిస్తున్నాడు. పోషించిన యీ జగత్తును కడపటికి తనయందే లీనముగావించుకుంటున్నాడు. మానవుడు తాను విడచిన శ్వాసను తిరిగి తానే యేవిధముగా స్వీకరిస్తున్నాడో అదే విధముగనే ప్రతి మానవుని సంకల్పము తనయందే ఆవిర్భవించి, ఆసంకల్పమును ఆ మానవుడే పోషించి, ఆ సంకల్పముల ప్రవృత్తిని మానవుడే నడచుకొని, కట్టకడపటికి ఆ ప్రవృత్తిని మానవునియందే లీనముగావించు కుంటున్నాడు. భగవంతునియొక్క సంకల్పముచే ఆవిర్భవించిన యీ జగత్తునకు విశ్వమని ఒక పేరు. విశ్వమనగా తనంతట తానే వ్యాప్తిగావించుకోటం. తనంతట తాను ఆనందముగా అనుభవించటం. ఇదియే వ్యాప్తికి సరియైనటువంటిది. ఈ విశ్వమును భగవంతుడు ఏవిధమైన లక్ష్యముతో, ఏ విధమైన సంకల్పముతో, ఏవిధమైన కారణముతో సంకల్పించెనో దానికి విరుద్ధముగా మానవుడు ప్రవర్తిస్తున్నాడు. విశ్వమనగా కేవలము భౌతికమైన పదార్ధములచే యేర్పడినది కాదు. ఇదంతయూ భగవంతుని అవయములతో యేర్పరుపబడినది. విశ్వమంతయూ భగవంతుని అవయవములయొక్క చేరికయే. విశ్వమనగా వివేకముగా, విస్తారముగా విస్తరింపచేసేదే. కానీ, యిట్టి భగవంతునకు ఎట్టికారణములు కూడను ఏర్పడవు. పదార్ధమునకు కొన్ని కారణములుండచ్చుగానీ, భగవత్సంకల్పమునకు యెట్టి కారణములు లేవు. ఇట్టి విశ్వమునకు తగిన కారణము భగవంతుడే. నిజముగా భగవంతుని ప్రతిబింబమే యీ విశ్వము. ఈ విశ్వము వేరు, విష్ణువు వేరుకాదు. 'వి' అనగా వివేకముగా, విస్తారముగా ఉండేటువంటిది. 'ష్ణు' అనగా తాను స్వరూపమును పొందినవాడు. అనేక అవయవములతో భగవంతుడే యీ జగత్తునకు ఆకారముగా తాను నిర్మించుకొని ఆ ఆకారమునకే విష్ణువని అని పేరుపెట్టి ప్రవర్తిస్తూ వచ్చాడు. ఈ ప్రపంచములో ప్రతి పదార్ధము సత్, చిత్, ఆనందము, రూపము, నామము అని ఐదింటిచే ఏర్పడుతూ వచ్చింది. అయితే మొదట సచ్చిదానందము నిత్యసత్యమైనటువంటిది. రూప నామములను ఆధారముచేసుకొని యీ మిగిలిన రెండూ ప్రవర్తింపచేస్తూవచ్చాడు. ఈ రూపనామములయొక్క ప్రతిబింబములే మానవులయొక్క చర్యలు. అయితే ఏ రూపము, ఏ నామము, ఏ విధంగా ప్రవర్తించాలనేది భగవంతునియొక్క నిర్ణయము. కొంతమంది జీవులు రాజసిక భావములతో కప్పబడి, కొన్నిరకములైన జీవులు తమసిక భావములతో కప్పబడి ద్వేషము, అసూయ అనే భావములచేత జీవిస్తూ వచ్చారు. ఇటువంటి భగవంతుని కొన్ని కారణములచేత రూపనామములుగా కల్పించుకొని అనేకరకములైన జీవితాలను గడుపుతూ వస్తున్నారు. మొదటగల సచ్చిదానందమును విస్మరిస్తూ వస్తున్నారు. ఈ సచ్చిదానందమును విస్మరించి కేవలము రూపనామములే ప్రధానమని ఆడుకుంటున్నారు మానవులు. రూపనామములు కల్పితమైనవేగానీ శాశ్వతమైనవికాదు. ఇవి సత్యమైనవి కావు. అసత్యము, అనిత్యములైనవి. అసత్యము, అనిత్యమైనవాటిని ఆధారముచేసుకొని, నిత్యసత్యమైన మూడు కారణాలను విస్మరిస్తున్నాము. ఈ కారణములచేత అనేకరకములుగా భగవంతుని శక్తినికూడా విస్మరిస్తున్నారు.భగవంతుడు నాభియందు సర్వకారణములచేత సంకల్పించుకుంటున్నాడు కనుక 'నాభికృష్ణుడు' అని పేరు. ఈ నాభినుండి ఆవిర్భవించిన శక్తికే 'పద్మనాభ' అని పేరు. దేనివల్ల? ఆ పద్మమునందు ఆవిర్భవించిన సంకల్పములే నాభియందు చేరాయి. ఇతనియందు హిరణ్యగర్భములు అనేకంగా ఆవిర్భవించాయి. అనగా హిరణ్యమును తన గర్భమునందుంచుకొనటంచే

'హిరణ్యగర్భుడు' అని పేరు. సర్వమానవులయందు నేను, నేను అనే అభిమానముచేత సంచరిస్తున్నాడు కనుక, యితనికి వాస్తుడు అని పేరు. ఈ నేను అనే పదము సర్వవ్యాపకమైనది. కనుక 'నేను' అని దీనికి పేరు పెట్టారు.భగవంతునికి పేర్లు అందరూ పెట్టినవేగానీ తనకుతాను పేరు పెట్టుకొని రాలేదు. పద్మమునుండి వచ్చినవాడు కనుక పద్మనాభుడని, హిరణ్యగర్భుడని యింకా అనేక పేర్లు యిట్టి కారణాలచేతనే యేర్పడుతున్నవి. ఈ పదములకు సరైన అర్థము బోధించి, ప్రచార ప్రభోధలు సల్పే నిమిత్తమై ఆధ్యాత్మికము ఆవిర్భవించింది. ఈ దివ్యమైన భావములను అంతరార్థములను బోధించి, తాను నడచుకొని తగిన ఆదర్శములనందించాలని యీ జగత్తునకు ఆధ్యాత్మికము బోధించాడు. ఇటువంటి ఆధ్యాత్మికమనే పవిత్రమైన మార్గమును సరిగా అర్థము చేసుకోటం లేదు. ఆధ్యాత్మికమనగా యేదో దైవపూజలు చేసుకోటం, ప్రార్థనలు చేసుకోటం, దైవ కార్యములందు పాల్గొనటం అని ఆవిధంగానే వారు విశ్వసించి ఉరుకుంటున్నారు. ఇటువంటి పవిత్రమైన ఆధ్యాత్మిక తత్వము జగత్తునకు రూపనామములచేత ప్రబోధలు సల్పి తగిన అంతరార్థమును ప్రబోధించాలి.

1968లో వరల్డు కాన్ఫరెన్సు బోంబాయిలో జరిగింది. అక్కడనే అప్పుడు ధర్మక్షేత్రము అనే ఉత్తమమైన పేరుతో నిర్మాణమునకు పునాదులు వేశారు.. ధర్మక్షేత్ర నిర్మాణమునకు ఇందూలాల్ షా మూలకారణము. ఇట్టి ధర్మక్షేత్రమునకు మూలకారకుడైన ఇందూలాల్‌షా అనేకవిధములుగా వ్యాప్తిగావించి జగత్తునకు దీనిని బోధస్తూ వచ్చాడు. దీనికి తోడుగా సరళాదేవి నిల్చి దానికి తగినటువంటి బాలవికాస్‌లు, మహిళావిభాగము యిలాంటి పవిత్రమైన స్త్రీల తత్త్వము ప్రబోధించే నిమిత్తమై కంకణం కట్టుకుంది. ఈవిధముగా యిరువురు చేరి యీసాయి ఉద్యమము ప్రపంచమునకు యెంతనో వ్యాప్తిగావిస్తూ వచ్చరు. ఇప్పటికి కూడను వయస్సు మళ్లినప్పటికీ వారు యెంతో కష్టపడి వారు జరుపుతూ వస్తున్నారు. భగవంతునియొక్క తత్త్వము అర్థముగావించుకోటం అందరికీ సాధ్యము కాదు. భగవంతుడు ఉపాధిలేని శిల్పుడు, రంగులేని కుంచము కలవాడు, ఆధారములేని గోడపై చిత్రించిన జగత్తే యీ ప్రపంచము. ఇట్టి ఆధారము, ఆధేయములేని తత్త్వాన్ని ప్రపంచమునకు బోధిస్తూ రావాలి. ఇలాంటి సత్యాన్ని మనము గుర్తించి వర్తించటనికి మనం కృషిచేయాలి. ఆధ్యాత్మికమంటే యేదో కేవలం పూజలు చేయటము, వ్రతములు చేయటము యింతమాత్రమే మనము కాలమును వ్యర్థము చేయకూడదు. ప్రతి మానవుడు భగవంతుని అంశమనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. ఇదే భగవద్గీతయందు 'మమైవాంశో జవలోకే జీవభూతస్సనాతనః , వాసుదేవమిదం సర్వం' యిలాంటి సత్యాన్ని మనం విస్మరిస్తున్నాము. కనుక యిలాంటి సత్యమును విస్మరించిన దానిని తిరిగి ఆవిర్భవింపచేసి ప్రపంచమునకు చాటుతూ రావాలి. అనేక క్షేత్రాలు నిర్మించాము. కానీ ప్రతీ క్షేత్రమునకు ఒక్కొక్క చరిత్ర ఉంటున్నాది. ఈ చరిత్రకు తగిన ఆధారము లేకపోలేదు. ధర్మక్షేత్రము నిర్మించే సమయములో ఎన్ని శ్రమలు పడ్డాడో ఇందూలాల్ షా అది స్వామికి తెలుసు. అక్కడ యేమార్గము లేని చోట ప్రయాణము చేసి కంపలలో తిరిగి యేది బాగుంటుందో నాకుకూడా చూపిస్తూ వచ్చాడు. ఇప్పుడు నిర్మించిన ధర్మక్షేత్రమునకు అప్పుడు యేవిధమైన మార్గము లేదు. చాలా దూరము నడచుకొని, ముండ్లను దాటుకొని, కంపలను దాటుకొని చాలా శ్రమ పడ్డాడు. ఇది మహాకాళీ కంపెనీ రోడ్డు. అలాంటి ప్రదేశములో చాలా శ్రమ పడి, కష్టపడి చేశాడు. అనేకమంది సహాయముతో దాన్ని యేదోవిధంగా పూర్తి చేసాడు. ప్రతి చిన్న కార్యము చేయాలన్నా అందరి సహాయము లేకుండా వీలుకాదు. ప్రారంభములో అన్నీ అడ్డులే తగులుతాయి. దేవతలు, దానవులు సాగరమును మధించే సమయులో విషమే వచ్చింది. కానీ విషము ఆవిర్భవించినదని యేమాత్రము వెరువక తిరిగి పట్టుపట్టి దానినే సాధిస్తూ వచ్చారు. అప్పుడే అమృతమయము, ఆనందమయము యిలాంటివన్నీ ఆవిర్భవించాయి. మన హృదయమే క్షీరసాగరము. మన పట్టుదలయే దానికి కవ్వము. మన సాధనే చిలకటం. ఇలాంటి సాధన లోపల ప్రప్రథములోపల కొన్ని అడ్లు తగులుతాయి. కాని,

యీ కష్టములకు, నష్టములకు మనము వెరువక సాధించటానికి పట్టుపట్టాలి. అప్పుడే ఆనందమయమైన స్థానం మనకు లభిస్తుంది. ఈ విధంగా ప్రతి వ్యక్తి అనేకవిధములైన కష్టములకు ఓర్చుకొని యిలాంటి పవిత్రమైన క్షేత్రములు కడుతూ వచ్చారు. భద్రాచలము, బదరీనాథ్, కేదారనాథ్, అమర్‌నాథ్ గొప్ప గొప్ప క్షేత్రములన్నీ నిర్మిస్తూ వచ్చారు. ఈ క్షేత్రములంతా శంకరాచార్యులవారు నడచిపోయి అనేక శ్రమలకోర్చి దిగ్విజయము గావించారు. ఎవరైనా యెట్టికార్యములు చేయవలసి వచ్చినప్పటికి జనుల యొక్క సహకారము అందుకోవలసి వస్తుంది. ఐకమత్యము చరినప్పుడే యీ ఆనందమునకు నోచుకోగలుగుతాము. ఐకమత్యమనేది యీ కలియుగమునందు తగ్గిపోయింది. యూనిటీ లేదు, ప్యూరిటీ లేదు కానీ ఎనిమిటీ ప్రవేశించి అనేక కష్టములకు గురిచేస్తున్నాది. ఎక్కడ ద్వేషభావము చేరుతుందో అక్కడ యూనిటీ అనేది శూన్యము. కనుక, యీనాడు మనకు ఐకమత్యము అత్యవసరము. ఐకమత్యమే మానవ జీవితమునకు బలము. ఎట్టసంకల్పమొ అట్టి మార్పు కలుగుతుంటుంది. సంల్పము యెట్టిదో అట్టిదే చర్య జరుగుతుంది. ఎట్టి చర్యయో అట్టి ఫలమే లభిస్తుంది. ఎట్టి ఫలమో గమ్యము మనం చేరుకుంటాం. కనుక మనం యీనాడు గమ్యానికి చేరకుండాపోవటానికి మూలకారణము సంకల్పాలు సక్రమమైనవిగా లేవు.మానవుని సంకల్పములు సరైనవిగా ఉండాలి. దైవము, దైవము అని ప్రేమించినట్లుగా మీరు నటన చేస్తుంటారు. ఈ ప్రేమ సత్యమైన ప్రేమ కాదు. ఇది అసత్యమైన ప్రేమ. కల్పితమైన ప్రేమ. శారీరక సంబంధమును కల్పించుకొని, ధనకనక వస్తువాహనాదులతో సంబంధము కలిగించుకొని అందరూ ప్రేమస్తున్నారేగానీ యీ ప్రేమను యెవ్వరూ నమ్మరు. ఇదంతా కపటమైన ప్రేమ. నాకుకూడా ఎన్నో కేబుల్సు వస్తుంటాయి. 'స్వామీ! మిమ్మల్ని ప్రేమిస్తున్నాము. కాబట్టి మమ్మల్ని దరి చేర్చుకోండి' అని. సాయి అంత సులభంగా లభించేవాడుకాదు. మీరు ప్రేమిస్తున్నామని చెప్పినంతమాత్రమున నేను నమ్మటానికి వీలుకాదు. ఈ ప్రేమకు ఏ త్యాగమున్నది? ఈ ప్రేమకు ఏ శక్తి కలదు? నేడు చెప్పిన మాట రేపటికి తప్పిపోతున్నారు. ఇలాంటి అసత్యవాదుల ప్రేమను నమ్మటానికి వీలవుతుందా? సత్యనిత్యమైన హృదయము నుంచి ఆవిర్భవించాలి. లవ్ అనేది హార్ట్ టు హార్ట్. ఇది ఆత్మ అనేదానికి సంబంధము ఏమిటి? ఆత్మ అనేదానికి, బ్రహ్మ అనేదానికి బేధము లేదు. బ్రహ్మ అనగా ఆత్మయొక్క స్వరూపమే. ఆత్మ స్వరూపమనగా హృదయమందున్న చైతన్య తత్వమే. ప్రతి మానవునియందు చైతన్యశక్తి ఉంటున్నది. ఆ చైతన్యశక్తియే లేక మానవుడు బ్రతకలేడు. ఆ చైతన్యమే ఆత్మ స్వరూపము. ఆ చైతన్యమే బ్రహ్మస్వరూపము. అదే నిత్యానందమయము. అదే పరమానందమయము. అదే యోగానందమయము. అదే అద్వైతానందమయము. అట్టి ఆనందమయమైన హృదయమును లోపల ఎవరు పెట్టుకున్నారు? మాటలు కోటలు దాటుతాయి. కాలు చూస్తే గడప దాటదు. ఇట్టి మటలు నమ్మి అనేక రకములుగా మోసపోతున్నారు ప్రపంచములో. నిజంగా ప్రేమ ఉన్నవారు, నిజంగా హృదయమున్నవారు మాటలు చెప్పరు. ప్రవర్తనలో నిరూపిస్తూ వస్తున్నారు. కానీ యీనాడు ప్రవర్తన శూన్యము. మాటలు మాత్రము అధికము. అటువంటివారు పక్కా దొంగలే తప్ప సరైనవారు కాదు. ఇట్టి దొంగలను ఆశ్రయించి ఇట్టి దొంగలను నమ్ముకొని మనము గమ్యము చేరగలమా? కనుక మనము చెప్పనక్కరలేదు. హృదయాన్ని కరగించుకొని, అది ప్రవహించటానికి తగిన మార్గాన్ని పెట్టుకోవాలి. హృదయము కరగి ప్రవహించినప్పుడే భగవంతుని హృదయము హత్తుకుంటుంది. మాటలు అనేకరకములుగా చెప్పవచ్చును. కనుక, యిలాంటి దీనికి మనం లొంగకూడదు. ఎంత కష్టమైన, నష్టమైనా, దుఖఃమైనా హృదయముయొక్క స్థాయిని పట్టుకొని మనం సాధిస్తూ రావాలి. కానీ మనం యీనాడు అట్టి పవిత్రమైన గమ్యాన్ని చేరాలనే సంకల్పము లేదు. గమ్యమంటే యేమిటో అర్థముకాని వారికి చేరటం యెట్లా సాధ్యమవుతుంది? ప్రేమ ఒక్కటేగానీ రెంటు మూడు తునకలు లేవ. ముక్కలు ముక్కలుగ చేసి నాపైన ప్రేమ, నీపైన ప్రేమ అని చెప్పుతూ రావటం సరైన ప్రేమ కాదు. ఇది కేవలము కల్పితమైన ప్రేమ. కల్పనలోనే కల్పన ఉంటున్నాది. మన

హృదయము ఒక్కటే ఒక్కటి. మన హృదయమును ముక్కలు చేయటానికి వీలవుతుందా? ముక్కలు చేసి మనిషికి కొంచెం కొంచెం యివ్వటానికి వీలవుతుందా? ఇది చెరకు గడ కాదు. లడ్డుముద్ద కాదు, దీన్ని ముక్కలు చేయటానికి. ఇది ఎప్పటికీ సత్యముగా ఉండేది. అమృతమయమైన ఆనందాన్ని లౌకికమైన మార్గములో ప్రవేశపెట్టి యిదే అమృతమయమని అనుకుంటే కేవలం కల్పితము కాదా? కొన్ని కష్టములను, నష్టములను మనం తట్టుకోవాలి, నెట్టుకు పోవాలి. వాటిని తట్టుకొని, నెట్టుకొని సాధించిన వాడే భక్తుడు. నిజంగా భగవంతుని చేరాలనుకొనేవారు ఒక పట్టు పట్టి ఆ పట్టిన పట్టు సాధిస్తూ రావాలి.

పట్టిన పట్టేదో పట్టనే పట్టితివి
పట్టు నెగ్గెడి దాక అట్టె యుండు
కోరిన దేదియో కోరనే కోరితివి
కోర్కె చెల్లెడుదాక కొలచియుండు
అడిగిన దేదియో అడగనే అడిగితివి
అడిగిన దిడుదాక విడువకుండు
తలచిన దేదియో తలచనే తలచితివి
తలపు తీరెడు దాక తరలకుండు
పోరు పడలేక తానైన బ్రోవ వలయు
ఒడలు తెలియక నీవైన అడగవలయు

అంతియేగానీ కల్పితమైన మాటలచేత, ప్రేమచేత భగవంతుని మోసము చేయటానికి ప్రయత్నిస్తున్నారు భక్తులు. ఇలాంటి వారికి భగవంతుడు ఎప్పటికీ చిక్కడు.

మనము యెంత ప్రమాదము వచ్చినప్పటికీ, యెటువంటి కష్టములు వచ్చినప్పటికీ తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగిపోవాలి. భగవంతుడు కష్టములలోనే మనకు లభిసాడు. కష్టే ఫలే అన్నారు. న సుఖాత్ లభతే సుఖం. సుఖముచేత మనకు సుఖము చిక్కదు. ఈ కష్టములు భగవంతుడు అందించిన వరప్రసాదములుగా భావించాలి. అట్టిదానిని మనం స్వీకరించి ఆనందముగా దానిని ఆచరణలో పెట్టి అందుకోవాలి యీ ఆనందము.

సరళమ్మ, ఇందూలాల్‌షా యిలాంటి కష్టములనెన్నింటినో తట్టుకొని, నెట్టుకొని వచ్చారు. వీరు ఎక్కడున్నారో తెలుసా? బొంబాయిలో ఉంటున్నారు. బొంబాయి సామాన్యమైనదికాదు. ఒక బాంబు వంటిది బొంబాయి. దాని మధ్యలో నిల్చి దీనిని సాధిస్తూ వచ్చారు. మంచి చేసినా కష్టమే, చెడ్డచేసినా కష్టమే. కనుక ఎన్ని రకములైన కష్టములు వచ్చినప్పటికీ తట్టుకొని, నెట్టుకొని సాధించాలి. ఇందూలాల్‌షాను యెన్నివిధాలుగానో హింసిస్తూ వచ్చారు. కానీ అతను అచంచలమైన భక్తితో సాధిస్తూ వచ్చాడు. ఏ చిన్న కార్యము చేయాలన్నా కొంత ప్రసాదం అవసరం. ఒకరిని ఆశ్రయించక తప్పదు. కనుక భగవత్కార్యాలలోపల భగవత్కర్మలలోపల ప్రవేశంచిన వ్యక్తులు కొన్ని కష్టములను, నష్టములను నెట్టుకొని రావాలి. ఇలా సాధించుకుంటూ వచ్చినవాడు ఇందూలాల్‌షా. నలభై సంవత్సరములనుండి సాయిని పట్టిన పట్టు చాలా గట్టి పట్టు. ప్రపంచమంతా సంచరించి సాయి తత్త్వమును ప్రబోధిస్తూ వచ్చాడు. వారు వేసే ప్రశ్నలకు చక్కని జవాబు యిచ్చుకుంటూ వచ్చాడు. అన్నింటియందును, లౌకిక, భౌతిక, ఆధ్యాత్మికమార్గలందు సిద్ధముగా ఉండాలి. ఆవిధంగా శ్రమపడి దేహాన్ని చాలా ఖర్చుపెట్టుకున్నాడు. ఒక చిన్న విషయము మీకు చెప్తుతున్నాను. పోయిన నెల బెంగుళూరుకి వచ్చి నన్ను చూచి వెళ్లాడు. ఎంతో ఆశ పెట్టుకొని, కొండంత ధైర్యముతో ఉండినాడు. స్వామి యీవిధంగా పడిపోయినాడని, మంచంపైన ఉండగా చూచాడు. అయితే తాను ఎవ్వరికీ చెప్పడు. మనసు లోపల చాలా బాధపడుతూ వచ్చాడు. కొండంత ఆశ

పెట్టుకుంటే స్వామికి యీవిధంగా అయిపోయిందే యేమిటి యేమిటి అని లోపల లోపల తపన పడుతూ వచ్చాడు. ఒక నెల మాత్రం చూచాడు. సరైపోయింది. ఎప్పుడూ ఆరోగ్యము చెడుపుకునేవాడు కాదు. ముఖ్యంగా స్వామిచింత చేత భవిష్యత్తు యేవిధంగా చేయాలి అనే నిరంతర చింతనతో అన్నహారాలు మానాడు. ఈ భవిష్యత్తు విషయంలో ఎన్నో ప్లానులు వేశాడు. సరళమ్మ, ఇందూలాల్‌షా చెప్పలేదు కానీ లోపల లోపల చాలా బాధపడుతూ వచ్చారు. స్వామి విషయమే ఎక్కువగా చింతిస్తూ వచ్చారు . ఎవరు చెప్పినా వారు నమ్మరు. ఒకరి నమ్మకాలను వారు ఆశ్రయించలేదు. వారి నమ్మకమే వారిది.

కనుక స్వామి విషయములో ఎవ్వరూ ఏవిధంగా యోచించనక్కరలేదు. స్వామికి ఎట్టి ప్రమాదములు ఉండవు. ఎన్ని రకములైన కష్టములు, నష్టములు వచ్చినా తట్టుకొని, నెట్టుకొని వచ్చేవాడు స్వామి. ఎవ్వరూ బాధపడనక్కరలేదు. ఎవ్వరూ కష్టపడనక్కరలేదు. స్వామి అన్నీ సాధించుకుంటూ వస్తాడు. ఏదో లౌకికమైన దేహముతో, లౌకికమైన ఆహారముతో మార్పులు జరుగవచ్చు. అవి తాత్కాలికమైనవే కానీ శాశ్వతమైనవి కాదు. కనుక ధైర్యముగా ఉండమని నేను ఆశిస్తున్నాను. నేను యీవిధంగా అయినానంటే ఏది ఔషధము? భక్తులు చేసిన ప్రార్థనలే నా ఔషధము. ఈ ఒక్క నెల మద్రాసులోగానీ, హైదరాబాదులోగానీ, గుంటూరులోగానీ, బొంబాయిలోగానీ అనేకరకములుగా భక్తిప్రపత్తులు అభివృద్ధి అవుతూ వచ్చాయి. ఇంటింటియందు భజనలు, నామస్మరణలు, తపస్సులు, కొన్నివిధములైన సాధనలు అధికంగా చేసుకుంటూ వచ్చారు. వారు చేసిన ప్రార్థనా ఫలితమే నేను యీనాడు నిల్చుకొని మాట్లాడటానికి వీలైంది. దేహమునకు బాధను కావాలని కోరలేదు, పోవాలని నేను ఆశించలేదు. ఆశించింది మీరే. మీరు ఆశించింది మీరు కాపాడుకుంటూవచ్చారు. ఈ దేహము నాది కాదు. ఈ దేహము మీదే. మీ దేహాన్ని మీరు చూసుకోవలసిందే. నేను దేహము కాదు. దేహిని.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధబంధనల ముద్రలు లేవు నిజంబుచూడ యా
దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

ఆత్మకు ఎట్టి చావుపుట్టుకలు లేవు. ఎట్టి బాధలు, ఎట్టి కష్టములు లేవు. చెబుతే మీరు నమ్మరేమోగానీ యిక్కడ తగిలిన బాధకు డాక్టర్సు చాలా బాధ పడ్డారు. ఇట్లా జరిగిన దానికి రెండు మూడు సంవత్సరముల వరకు నడవటానికి వీలుకాదు. జాయంటుగా ఉండటానికి బాల్ ఉంటుంది. బాల్ ముక్కలైపోయింది. దీనిని యేమైనా సరిదిద్దుదామంటే మజిల్సు లేవు. ఎముకలు చూద్దామా అంటే నా ఎముకలు వజ్రాలుగా ఉన్నాయి. ఏమాత్రము అతికించటానికి వీలులేకపోయింది. అటువంటి కఠినమైన ఎముకలు నావి. కట్టకడపటికి వీలుకాక రాడ్ వేసి ఆపరేషన్ చేశారు. ఈ విధముగా చేసిన తరువాత నడచుటకు చాలాకాలము వీలుకాదు. ఈ దేహాన్ని రక్షించుకునే నిమిత్తము డాక్టర్లు యేమేమో చేశారు. ఇది వారి డ్యూటీ. అంతేగానీ నేనేమాత్రము ఆసక్తి చూపలేదు. నా ఆదర్శము మీకందించే నిమిత్తమే. ఇప్పుడు కాదు రెండు సంవత్సరములనుండి బోధనలు చేస్తూనే ఉన్నాను. దేహాభిమానము దినదినము తగ్గించుకుంటూ రావాలి. ఆత్మాభిమాను పెంచుకుంటూ పోవాలి. మీరు ఆత్మస్వరూపులేగానీ దేహస్వరూపులు కాదు.

దేహమునకు వస్తుంటాయి పోతుంటాయి. బాధలు దేహానికి ఉంటాయిగానీ ఆత్మకు కల్గవు. కదిలించటానికి వీలుకాదు. కదలిస్తే షాక్ మాదిరి బాధ అయింది. నేను డాక్టర్సుకు చెప్పాను‘ అయ్యా! మీరు ఆపరేషన్ చేస్తున్నారు. ఈ దేహము నాదికాదు.’ ఇది నాది కాదని త్యాగము పూనుకున్నప్పుడు ఎట్టి బాధలు కల్గవు. ఒక చిన్న విషయం. ఎంతమంది చెప్పినా డాక్టర్సును తప్ప వేరెవరిని ఆపరేషన్‌రూమ్‌లోకి వదలరు. ఏమైనా సరియే

నేను స్వామి వెంట ఉండాలి, స్వామినే చూసుకోవాలి అనే పట్టుదలతో ఒక ప్రతిజ్ఞ తీసుకొని , నన్ను వ్యాన్‌లో తీసుకొనిపోతుంటే నా తల దగ్గరన కూర్చున్నాడు. ఆపరేషన్ రూముకి తీసుకుపోతే తానుకూడా అందులో ప్రవేశించాడు. డాక్టర్సు వేసుకునే డ్రస్ తానుకూడా వేసుకున్నాడు. అక్కడే కూర్చున్నాడు. నేను చెప్పాను,'సత్యజిత్ ! నీవు రక్తముచూస్తే భరించుకోలేవు. బయటకుపో' అన్నాను. 'స్వామి చెప్పింది నిజమే. రక్తం చూస్తే భయమే. కానీ దానికోసం నేను భయపడను' గట్టిగా చెప్పాడు. దగ్గరే కూర్చున్నాడు ఆపరేషన్ రూములో. సుత్తి తీసుకొని ఎముకలు కొడుతున్నారు. చిన్నసుత్తి కాదు, పెద్దసుత్తి. దేనికీ బెదరలేదు. ఏమిచేస్తారో చూడాలి. చేసినారు. అంతా అయిన తర్వాత 'స్వామీ ! ఇంత బాధ మీరు ఎట్లా ఓర్చారు? ఎట్లా మీరు భరించుకున్నారు?' మీబోటి భక్తుల ప్రేమ తత్త్వమే నా బలము. ప్రేమ పదమే సర్వబలములకు మూలకారణము. ఇటువంటి ప్రేమతత్త్వాన్ని పెట్టుకున్నప్పుడు ఎవరికి ఏవిధమైన బాధకలిగినా యేమాత్రము ముప్పుకలుగదు. అట్టిది సాధించుకొనిన దేహమును అనుసరించాడు. ఒక దృఢమైన విశ్వాసము, నిశ్చలమై నమ్మకము నిస్సందేహముగా ఉండాలి. మాటలతో చెప్పటంగానీ, చేతలతో చేయటంగానీ రెండూ ఒక్కటిగా ఉండాలి. ఆవిధంగా ఉండటంచేత భక్తులు చాలామందికి స్వామి దయ కలుగుతూ వచ్చింది. అన్ని గ్రామములయందు యీ భజనలు విడువకుండా చేస్తూ వచ్చారు. ఏమి వారి ప్రార్థన? మా స్వామి త్వరగా బాగైపోవాలి. మా స్వామి బయటకు రావాలి. మా స్వామి ఆరోగ్యంగా ఉండాలి. ఇదే ప్రార్థన వారిది. ఎవరిని అడిగినా మా స్వామికి బాగుండాలి. నాకు కొన్ని వేలు లక్షలు టెలిగ్రములు వచ్చాయి. ఈ విధంగా భక్తులు అనేక రకములుగా చెప్పలేరుగానీ లోపల లోపల చాలా బాధపడుతూ వచ్చారు. వారి బాధయే తపస్సుగా మారిపోయింది. ఆ తపఃఫలమే స్వామియొక్క ఆరోగ్యమునకు మూలకారణము. కనుక యిప్పుడు యింత ఆనందంగా , ధైర్యంగా ఉన్నానంటే వారి భక్తి ప్రపత్తులే మూలకారణము. నా శక్తిని నేను యేమాత్రము ఉపయోగపెట్టుకోలేదు. నేను ఉపయోగపెట్టుకుంటే ఒక్క క్షణంలో బాగైపోవచ్చు. స్వార్థము నాలో లేదు. నాకు బాగైపోవాలనే స్వార్థము నాలో యేనాడూ లేదు. అందరూ ఆనందంగా ఉండాలి.

(2003 జూలై 13వ తేదీ ఉదయం గురుపూర్ణిమ సందర్భముగా భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)